క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



కల్యాణ మండపానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని నంగనూరుపల్లె గ్రామంలో నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.30లక్షలు విరాళం ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా శనివారం నంగనూరుపల్లె గ్రామంలోని శివాలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. అనంతరం కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. విశాలమైన మైదానంలో రూ.70లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరయ్య యాదవ్, సర్పంచ్ లక్ష్మీదేవి వెంకటరాముడు, ఎంపీటీసీ క్రిస్టిపాటి సంధ్య మంజునాథ శర్మ, ఉపసర్పంచ్ గంగయ్య, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బందారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డిని గెలిపించండి



మాట్లాడుతున్న అపుస్మా నాయకుడు దేవిప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంవీ.రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం అపుస్మా నాయకులు కె.దేవిప్రసాద్‌రెడ్డి, షఫీ, గురురాజి భాస్కర్‌రెడ్డిలు విజ్ఞాన్, బ్రిలియంట్ స్కూళ్లలో ప్రచారం చేశారు. రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు.

విద్యుత్ తీగలు తగిలి చొప్ప దగ్ధం

రాజుపాళెం : మండలంలోని తొండలదిన్నె గ్రామానికి చెందిన చెన్నంగి పెద్ద వెంకటరాముడుకు చెందిన చొప్ప ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. ఆ గ్రామం నుంచి ప్రొద్దుటూరుకు ట్రాక్టర్‌లో చొప్పను తరలిస్తుండగా వెలవలికి వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రమ్ము వద్ద ఉన్న లైన్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు.రూ.30 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంను ప్రారంభిస్తున్న డీఎం

పోరుమామిళ్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండులో శనివారం బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసులు చలివేంద్రంను ప్రారంభించారు. కమ్మవారిపల్లెకు చెందిన జి.వి.రమణ సహకారంతో పసుపులేటి వెంకటమ్మ జ్ఞాపకార్థం టీచర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దంతవైద్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, వెంగమాంబ స్కూల్ కరస్పాండెంట్ పుల్లపనాయుడు, ఏపీటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్, సీఐటీయూ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైవీ రావుకు నివాళి

ప్రొద్దుటూరు : ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు మృతి తీరని లోటని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఎన్నార్ శేఖర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం వైవీ రావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. డిపో సెక్రటరీ బీసీ శేఖర్, బీవీ రమణ, శేఖర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : మండలంలోని ఆటోనగర్‌లోకు చెందిన వి.రామకృష్ణ (45) అనే వ్యక్తి అనారోగ్యంతో చనిపోయాడు. అతనికి బంధువులు ఎవరు లేకపోవడంతో మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్‌కు స్థానికులు సమాచారం ఇచ్చారు. వారు స్పందించి హిందూ శ్మశాన వాటికలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, సీఈఓ మల్లికార్జున, కామనూరు శివసాయినాథ్, తాళ్లమాపురం కానిస్టేబుల్ భాస్కర్‌లు పాల్గొన్నారు.

శివోహం



ప్రత్యేక అలంకరణలో సైకత లింగం



రాజుపాళెం: వెల్లాలలో భీమలింగేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఘనంగా శివరాత్రి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : శివ శివ.. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు పరమశివున్ని భక్తి శ్రద్ధలతో శరణువేడారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పలు శివాలయాల్లో భక్తులు చేసిన శివనామ స్మరణలతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అభిషేకాలు, అర్చనలు చేయించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకతలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి, శంకరాచార్యుడు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి, చండీ మాతకు కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు.

అగస్త్యేశ్వరస్వామికి ఎమ్మెల్యే రాచమల్లు ప్రత్యేక పూజలు

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని కాలక్షేప మండపంలో గంగాగౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆశీనులను చేశారు. శుభ ముహూర్తంలో వేదమంత్రాలు పఠిస్తుండగా కన్నుల పండువగా మంగళవాయిద్యాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదాత మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అగస్త్యేశ్వరాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. శివోహం అన్నప్రసాద సేవా సంఘం చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, సతీమణి కవిత అన్నప్రసాదానికి సహకరించారు. అమృతేశ్వరస్వామి ఆలయంలోని మరకత లింగేశ్వరునికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, నవరత్న లింగానికి కాశీ జలాలతో భక్తులు అభిషేకాలు చేయించారు. భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాలు, గురుపీఠాలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నామా రమేష్ బాబు, పీఆర్‌ఓ దారా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగాలకు ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లెలోని సద్గురు సమర్థనారాయణ స్వామి ఆశ్రమంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని శివలింగ మూర్తులకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆశ్రమాధిపతి గోపాల స్వామి భక్తులను ఆశీర్వదించారు.

హరోం... హర!

రాజుపాళెం : హరోం.. హర.. శివ.. శివా.. అనే శివనామస్మరణలతో శివాలయాలు ప్రతిధ్వనించాయి. మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని శనివారం మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీభీమలింగేశ్వర, పార్వతీదేవి ఆలయాల్లో తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో భక్తులు స్వాముల వారికి పూజలు చేశారు. మడువంక వద్ద ఉన్న హనుమత్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో, సోమాపురంలో శ్రీచక్రం ఉన్న శివాలయంలో, మిగతా గ్రామాల్లోని ఆలయాల్లో స్వాములవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని మహిళలు, ప్రజలు వాహనాల్లో శైవ క్షేత్రాలకు తరలివెళ్లారు.

కల్యాణం.. కమనీయం

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో గంగాపార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం రెడ్డి, సహదేవరెడ్డి, హరిచంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రంగారెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



దువ్వూరు: ఓ శాంతి భవనంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం



బ్రహ్మంగారిమఠం : శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం వీరబ్రహ్మ సుప్రభాతం, నామసంకీర్తనం, ఉపనిషత్ పారాయణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం దీక్షా బంధనాలంకారోత్సవం, భజన చేశారు. సాయంత్రం కందిమల్లాయపుర సంస్థాన ఆస్థాన కవి నిగమాగమ కళాకోవిద డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు ఉపన్యాసం భక్తులకు ఆకట్టుకుంది. రాత్రి కల్యాణ మంటపంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తజనం కనులారా వీక్షించి తన్మయులయ్యారు. అనంతరం పాల రామాంజనేయులు భాగవతారు చెప్పిన హరికథా కాలక్షేపాన్ని భక్తశ్రద్ధలతో విన్నారు. నరనంది ఉత్సవం ఉత్సాహంగా సాగింది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశరుద్రాభిషేకం (జాగరణ) నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ, మఠం వారు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బి.మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వాముల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరాజులస్వామి, తొట్లపల్లె అచలానంద స్వామి ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి, ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణమాచార్య, కందిమల్లాయపల్లె పుర ప్రజలు పాల్గొన్నారు. బి.మఠం ఎస్‌ఐ విద్యా సాగర్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

శ్రీ ఈశ్వరీదేవిమఠంలో..

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం పక్కనే ఉన్న జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రభాతసేవ, రుద్రాభిషేకం, సహస్రనామార్చన, స్వస్తి వాచక మంగళవాద్య పూర్వక యాగశాల ప్రవేశం, శ్రీ విఘ్నేశ్వరపూజ, స్వస్తి పుణ్యాహవచనం, అంకురారోపణం, దీక్షా కంకణధారణం, అఖండస్థాపన, మండపారాధన, సర్వదేవతాహ్వానం, ధ్వజారోహణం, నూతన కల్యాణమూర్తుల మంగళస్నానం, ఆవాహిత సర్వదేవతా షోడశోపచార ప్రత్యేక పూజలు, శాంతి హోమం, నైవేద్య, మంత్రపుష్ప, నీరాజన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణ మూర్తుల తులాభారం వైభవంగా జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణ సమితి జిల్లా సభ్యుడు చాపాడు వెంకటసుబ్బారెడ్డి చెప్పిన పురాణ కాలక్షేపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి శ్రీపార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు చెప్పిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశ రుద్రాభిషేకం(జాగరణ) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వాములు, ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : పాత దువ్వూరులోని భీమలింగేశ్వర స్వామి ఆలయం, పుల్లారెడ్డిపేట త్రిపీఠకాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. త్రిపీఠకాలయం, గుడిపాడు గ్రామంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. దువ్వూరులో ఓంశాంతి భవనంలో మూడు అడుగుల మంచు శివలింగాన్ని ఏర్పాటు చేశారు. మంచు శివలింగాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయం, ఎర్రచెరువు వద్ద ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనిపెంట రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నయ్యగారిపల్లె వద్ద ఉన్న ముక్కొండ ముక్కంటీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నల్లమల అటవీ ప్రాంతంలోని భైరవ కోనలో భైరవేశ్వర స్వామి దేవస్థానంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని రాత్రి జాగరణ చేశారు.



బ్రహ్మంగారిమఠం : ఈశ్వరీదేవిమఠంలో పార్వతీపరమేశ్వరులకు పంచామృతాభిషేకం



బ్రహ్మంగారిమఠం : కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



లంకమల క్షేత్రంలో ప్రత్యేక పూజలందుకుంటున్న ముక్తి రామలింగేశ్వరస్వామి



పండ్ల అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



సిద్దులు క్షేత్రంలో మాంగళ్యాన్ని చూపుతున్న పురోహితులు

బద్వేలు అర్బన్ : శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం పలు శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కొండ, కోనల్లో వెలసిన శైవక్షేత్రాలలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున శైవక్షేత్రాలకు తరలివెళ్లారు. ఆయా ఆలయాలలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

లంకమలకు పోటెత్తిన భక్తులు

లంకమల అభయారణ్యంలో వెలసిన ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంకు భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణలో దాతలు అన్నదానం ఏర్పాటుచేశారు. రాత్రికి స్వామి వార్లకు కల్యాణం నిర్వహించి, ఆలయ ఆవరణలోని కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నారపురెడ్డిశంకర్‌రెడ్డి భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని పురాతన శివాలయం, రూపరాంపేట శివానందస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. నాగులచెరువుకట్ట వద్ద ఉన్న శివాలయం, తెలుగు గంగ సమీపంలోని పార్వతి సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయం, అనంతగిరి క్షేత్రంలోని మృత్యుంజయాలయం, చెన్నంపల్లె శివాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

మల్లెంకొండకు పోటెత్తిన భక్తులు

గోపవరం : మండలంలోని మల్లెంకొండ భక్తులతో పోటెత్తింది. శుక్రవారం నుంచే కాలినడకన భక్తులు మల్లెంకొండకు చేరుకున్నారు. మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కొండపైన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్, బి.కోడూరు ఎస్‌ఐ నస్రీన్, బద్వేలు రూరల్ ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే డలంలోని రాచాయపేటలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని వల్లెరవారిపల్లె వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాఘమాసం ఆరంభంతో నాల్గవ శనివారం శివరాత్రి శనిత్రయోదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తులతో పోటెత్తిన జ్యోతిక్షేత్రం

కాశినాయన : మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. కత్తెరగండ్ల శివాలయం, అక్కంపేట విభూది నాగలింగేశ్వర శివాలయం, గంగన్నపల్లె శివాలయాల్లో వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జ్యోతిక్షేత్రం భక్తులతో పోటెత్తింది. అన్ని శివాలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కలసపాడు : స్థానిక ఉమామహేశ్వర దేవాలయం, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం పురోహితులు వెంకటరమణవరప్రసాద్, ఉమామహేశ్వర ఆలయ ధర్మకర్త సీతారామిరెడ్డిల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లెలోని శ్రీఅఖిలాండకోటి బ్రహ్మానంద ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలోని 108 శివలింగాలను, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని, నిలువెత్తు 25 అడుగుల శివలింగాన్ని, సహస్ర శివలింగాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గంగిరెడ్డిపల్లె సగిలేరు ఒడ్డున వెలసిన శివాలయం, చెన్నకేశవస్వామి ఆలయం, ఐత్రంపేట శివాలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎం.నరసింహ్మాపురం గ్రామ సమీపంలో గల పురాతన దపిశేశ్వరిదేవి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా శ్రీ సిద్దేశ్వరస్వామి కల్యాణం

పోరుమామిళ్ల : మండలంలోని సిద్దవరం సమీపంలోని సిద్దులు క్షేత్రములో శనివారం శ్రీ పార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి కల్యాణాన్ని పురోహితులు నాగరాజశర్మ, ఉద్యా అమరనాథశర్మలు వైభవంగా నిర్వహించారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, సురేఖ దంపతులు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్‌రెడ్డి, ఆరోగ్యరాణి దంపతులు, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సిద్దేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి కళ్యాణం తిలకించారు. ఎంపీటీసీ లక్ష్మిదేవి భోజన ఏర్పాట్లు చేశారు. శ్రీ మద్దిమాను గురప్పస్వామి దేవస్థానం, శ్రీ బాలా త్రిపురసుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, లింగమయ్య క్షేత్రం, కవలకుంట్ల, టేకూరుపేట శివాలయాలు, శ్రీ సిద్దులు క్షేత్రం, కొండుగారిపల్లె నాగుల పుట్ట భక్తులతో కిక్కిరిసి పోయాయి. అలాగే సిద్దులు క్షేత్రములో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది.



కత్తెరగండ్ల శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



లంకమల క్షేత్రంలోని కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

నాగనాథేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఖాజీపేట : పూజలందుకుంటున్న నాగనాథేశ్వరస్వామి



చాపాడు : పూజలందుకుంటున్న కేథారీశ్వరుడు

ఖాజీపేట : ఖాజీపేట సమీపంలో కొండపై కొలువైన నాగనాథేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు.

వైద్య శిబిరం

ఖాజీపేట ఆరోగ్య కేంద్రం సిబ్బంది కొండ దిగువన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య అన్నసత్రంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుమ్మా లక్ష్మిరెడ్డి ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

- ఖాజీపేటలోని అగ్రహారం శివాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు అన్నదానం నిర్వహించారు. అన్నదానంను ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు.

అల్లాడుపల్లె క్షేత్రంలో..

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. మండలంతోపాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి వీరభద్రస్వామి దేవాలయంలో వీరభద్రస్వామి, కేథారీశ్వరుడులను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ జీటీ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు. శ్రీ వీరభద్రస్వామి అన్నసత్రం, సర్వజన అన్నసత్రం, ఆర్యవైశ్య అన్న సత్రాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ కేసీ రాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి రాజేష్‌కుమార్, శ్రీవాణి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. తహసీల్దారు సుభానీ, మండల అధ్యక్షులు లక్షుమయ్య పర్యవేక్షించారు.

- ఓ వైపు వీరభద్రస్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, మరో వైపు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చెక్కభజన, కోలాటం, ఆర్కెస్ట్రా, పౌరాణిక నాటకాలు, జెయింట్ వీల్, ఊయల వివిధ రకాల ఆట వస్తువులు అందరినీ అలరించాయి.



విద్యుత్ దీపాల వెలుగులో శ్రీవీరభద్రస్వామి ఆలయం